క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం ఉత్తర నక్షత్రం ఏకాదశి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అకాల వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ: ఉరుములు, మెరుపులు పిడుగుతో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని తహసీల్దార్ రవినాయక్ బుధవారం తెలిపారు. గ్రామాల వారీగా ప్రజలు, పంటల పొలాలకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంత వర్షం కురిసిన పొలాల్లోని చెట్లను ఆశ్రయించ వద్దని చెట్టుపై పిడుగు ప్రభావం ఉంటుందని తహసీల్దార్ వివరించారు.

బీసీ వెల్ఫేర్ జిల్లా నూతన కమిటీ ఏర్పాటు



నూతన కార్యవర్గం

అద్దంకి: బాపట్ల జిల్లా బీసీ వెల్ఫేర్ జేఏసీ సమావేశం అద్దంకిలోని సింగరకొండలో బుధవారం నిర్వహించారు. సమావేశానికి బీసీ వెల్ఫేర్ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు హాజరయ్యారు. ఈ సమావేశంలో బాపట్ల జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా కొండూరు గోవిందు, ఉపాధ్యక్షులుగా గుంజి కోటేశ్వరరావ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి. కోటేశ్వరరావు, జనరల్ సెక్రెటరీగా కడియం రేణుక రవికుమార్, అలాగే జిల్లా ఆర్గనైజర్‌గా అంగలకుదురు టి. నటరాజన్, కార్యవర్గ సభ్యులుగా డి. సురేష్‌ను నియమించి ప్రకటించారు. బీసీ వెల్ఫేర్ జేఏసీ స్టేట్ కమిటీలోకి పామంజి రాంబాబుని తీసుకుంటామని అంగిరేకుల ఆశీస్సులు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని భార్యకు చెక్ అందిస్తున్న ఆర్డీఓ

చినగంజాం: పిడుగుపాటుకు గురై సంఘటనా స్థలంలో మృతి చెందిన గడ్డం బ్రహ్మయ్య కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయమందించింది. కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశాల మేరకు మృతుడు బ్రహ్మయ్య భార్య సుజాతకు చీరాల ఆర్డీఓ. తోట చంద్రశేఖర్ నాయుడు వారి ఇంటి వద్దకు వెళ్ళి రూ. 4 లక్షల చెక్ అందజేశారు. తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, తెలుగు దేశం నాయకులు వై. లక్ష్మి, పి. వీరయ్య, సర్పంచ్ ఆర్. ఆత్మారావు, ఉప సర్పంచ్ సీహెచ్ రాఘవయ్య, ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

చీరాల: భార్యపై భర్త.. మరో మహిళ కలిసి దాడి చేశారంటూ బాధిత మహిళ బుధవారం చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చీరాల మండలం కావూరివారిపాలెం పరిధిలోని బొగ్గులవారిపాలెంకు చెందిన గోపిరెడ్డి, మౌనికలు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. భార్యతో గొడవపడి కొంతకాలంగా గోపిరెడ్డి ఈపూరుపాలెంకు చెందిన శ్రావణి అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం గోపిరెడ్డి, శ్రావణిలు బొగ్గులవారిపాలెంలో ఉన్న తనపై దాడి చేశారంటూ మౌనిక ఫిర్యాదు చేసింది.

శిక్షణ తరగతులను సక్రమంగా నిర్వహించాలి



పరిశీలిస్తున్న ఆదిలక్ష్మి

చీరాల అర్బన్: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను సక్రమంగా నిర్వహించాలని ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఆదిలక్ష్మి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఆమె చీరాల శాఖా గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రంథాలయంలో నిర్వహించే రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సెస్సు వసూలుకు కృషి చేయాలన్నారు. గ్రంథాలయానికి శాశ్వత భవన స్థల సేకరణకు కృషి చేయాలన్నారు. సభ్యత్వ నమోదుల సంఖ్యను పెంచాలని సూచించారు. వేసవి శిక్షణ తరగతులలో విద్యార్థులు ఎక్కువ మంది వచ్చేలా తగు చర్యలు చేపట్టాలని గ్రంథపాలకురాలు డి.ధనమ్మకు సూచించారు.

కొంత నష్టం.. కొంత లాభం

- ఖరీఫ్‌లో దెబ్బతిన్న మినుము
- ప్రస్తుతం ఆశాజనకంగా మొక్కజొన్న



మొక్క జొన్నలు.. మిషన్ వేస్తున్న రైతులు

జె.పంగులూరు: వాతావరణం రైతులను ఎప్పటికీ ఒడిదుడుకులకు గురి చేస్తూనే ఉంటుంది. కానీ కర్షకుడు ఏనాడూ వెన్ను చూపడు. నష్టాలు భరిస్తూనే దేశానికి అన్నం పెట్టడంలో ముందుంటాడు. ఈ సంవత్సరం వర్షాల ధాటికి రైతులు ఖరీఫ్‌లో వేసిన మినుము పంట పూర్తిగా పాడైపోయింది. ఇంతవరకు మినుము పంటకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చిన జాడేలేదు. పంట పూర్తిగా నేలపాలు కావడంతో గింజ కూడా రైతులకు అందలేదు. అనంతరం రెండో పంటగా వేసిన మొక్కజొన్న రైతులకు కొంత ఊరట కలిగించింది. మొదటి పంటతో పూర్తిగా నష్టాలు చవిచూసిన రైతులు, రెండో పంట అయిన మొక్కజొన్న వల్ల కొంతమేర గట్టెక్కగలుగుతున్నారు. గత సంవత్సరం మొక్క జొన్న పంట క్వింటా రూ. 2300 నుంచి రూ. 2400 వరకు కొనుగోలు చేశారు. గత ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల వద్ద ఉన్న పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసింది. కానీ ఈ సంవత్సరం రైతుల వద్ద నుంచి ప్రభుత్వం ఒక్క గింజ కొన్న పాపాన పోలేదు. బ్రోకర్‌లు వారి ఇష్టాను సారంగా ధర నిర్ణయించి మొక్క జొన్న కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం క్వింటా మొక్క జొన్న రూ. 2000 నుంచి రూ. 2150 కి బయట మార్కెట్ వారు కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు 35 నుంచి 40 కింటాల వరకు దిగుబడి వస్తోంది. దీంతో రైతులు కొంతమేర ఊరట చెందుతున్నారు. కొందరు రైతులు మిర్చి పంటను పీకేసి మొక్క జొన్న వేశారు. మినుము తరువాత మొక్క జొన్న వేశారు. ఈ సంవత్సరం మిర్చి, పొగాకు, శనగ పంటలు రైతులను పూర్తిగా నట్టేట ముంచాయి. ప్రస్తుతం మొక్క జొన్న పంటనే రైతులకు కొంత ఊరట కలిగించేలా ఉంది.



మొక్కజొన్నలు ట్రాక్టర్‌కు లోడు చేస్తున్న రైతులు



మొక్క జొన్నలు ఆరబెట్టిన రైతులు

భారత సైన్య పోరాట పటిమకు సెల్యూట్



గాదె మధుసూదన రెడ్డి

పర్చూరు(చినగంజాం): పహల్గాం ఉగ్రదాడి ఘటనకు భారత సైన్యం సరైన నిర్ణయం తీసుకుందని వారి పోరాట పటిమకు వారికి హృదయ పూర్వకంగా సెల్యూట్ చేస్తున్నట్లు పర్చూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ ప్రజలందరూ భారత సైన్యానికి అండగా ఉండాలన్నారు. పహల్గాం ఉగ్రదాడి ఘటనకు ప్రతి స్పందనగా భారత రక్షణ దళాలు ఆపరేషన్ సింధూర్ ప్రారంభించాయాని, భారత సైన్యం సరైన నిర్ణయం తీసుకుందన్నారు. ఇటువంటి సమయంలో దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలని, దేశ ప్రజలను రక్షించడానికి కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఈ పోరాటంలో దేశ ప్రజలంతా భారత సైన్యానికి అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. అదే విధంగా బ్రిటిషు పాలకుల అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడిన విప్లవ యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకొని ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు.

భక్తి శ్రద్ధలతో నాగేంద్ర స్వామి తిరునాళ్లు



ఆదిపూడిలో పూలతో తయారు చేసిన నాగేంద్రుని పడగ



విద్యుత్ దీపాల అలంకరణలో స్వామివారి ఆలయం

ఆదిపూడి(కారంచేడు): మండలంలోని ఆదిపూడి గ్రామంలోని రెండు చెరువుల కట్ట మీద కొలువైన బాల నాగేంద్రస్వామి వారి 38వ తిరునాళ్ళను అత్యంత వైభవంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సంతానం లేని దంపతులు ప్రత్యేక పూజలు చేస్తే సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. దీంతో గ్రామంలోని దంపతులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు కూడా స్వామివారికి ప్రత్యేక పూజలు చేయడానికి తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన పూలతో స్వామివారి పడగ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రంగురంగుల విద్యుత్ దీపాలతో తయారు చేసిన మండపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల కోలాటంలు చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

10న ధ్యాన శివ విగ్రహ ప్రతిష్ఠ



కొణిదెనలో ప్రతిష్ఠకు సిద్ధమైన ధ్యాన శివుడు

బల్లికురవ: చరిత్ర కలిగిన కొణిదెన గ్రామ సమీపంలోని బ్రహ్మగుండం వద్ద ధ్యానంలో ఉన్న శివుని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం ఉదయం 8.30 గంటలకు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం చిలకలూరిపేట మండలం, మురికిపూడి, తాతాపూడి, బల్లికురవ మండలంలోని వేమవరం, గంగపాలెం, కొణిదెన గ్రామాల్లో గ్రామోత్సవం చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం విగ్రహాన్ని జలాధి, క్షీరాధివాసంలో ఉంచి శనివారం ఉదయం రాజుపాలెం గ్రామానికి చెందిన ప్రతిష్టాచార్యులు ఐనవోలు సీతారామచార్యులు బృందంచే ప్రతిష్ఠ, ప్రత్యేక అలంకరణ, శాంతి కల్యాణం ,అన్నసంతర్పణ చేపడుతున్నట్లు చెప్పారు. వేడుకల ఖర్చును గంగపాలెం గ్రామానికి చెందిన చెరుకూరి చెంచురామయ్య భరిస్తున్నట్లు తెలిపారు.

అనుమానితులు సంచరిస్తుంటే సమాచారం ఇవ్వండి



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సాంబశివరావు

వేటపాలెం: సముద్రతీర ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటే సమాచారం ఇవ్వాలని కొత్తపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ మెరైన్ సీఐ సాంబశివరావు తెలిపారు. బుధవారం ఓడరేవు, పల్లెపాలెం, రామా పురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం గ్రామాల మత్స్యకారులు, గ్రామ పెద్దలు, సాగర్ మిత్రలు గ్రామ విజిలెన్స్ కమిటీ సభ్యులకు యుద్ధ సన్నద్ధతపై అవగాహన సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సముద్రంలో ఉగ్రవాదులు జాడలు కనిపిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1093కు సమాచారం అందించాలని తెలిపారు. అదే విధంగా కొత్తపట్నం మెరైన్ స్టేషన్ సెల్ నెంబర్ 939214742 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. పాకిస్తాన్‌తో యుద్ధం జరిగే అవకాశాలు ఉన్నందున గ్రామంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రాణ నష్టం జరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తీరం వెంట గస్తీని ముమ్మరం చేసినట్లు వివరించారు. ఎస్సై రాజేష్ ఉన్నారు.

ఘనంగా వాసవీ మాత జన్మదినం



వాసవీమాతను దర్శించుకుంటున్న భక్తులు

చీరాల అర్బన్: పట్టణంలోని సంతబజారులో వేంచేసియున్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జన్మదినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జన్మదినోత్సవాలు సందర్భంగా ప్రతిరోజు విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్షమల్లెపూజ నిర్వహించారు. లక్ష మల్లెపూలతో పూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. అనంతరం దేవస్థాన ప్రాంగణంలో సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజ, ఉయ్యాలసేవ నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో దేవాలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమాలను దేవస్థాన అధ్యక్షుడు గుంటూరు మాధవరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నవధాన్యాలతో ఆరోగ్యం.. ఆదాయం



పి.గుడిపాడులో ర్యాలీలో పాల్గొన్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

మేదరమెట్ల: రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తూ నవధాన్యాలను పండించడం వలన ఆరోగ్యవంతమైన ఆహార ధాన్యాలను పండించుకోవడంతో పాటు భూమి సారవంతమౌతుందని కొరిశపాడు మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పేర్కొన్నారు. మండలంలోని పి.గుడిపాడు గ్రామంలోని ఓసీ, బీసీ కాలనీల్లో రెండో రోజు ఖరీఫ్‌లో కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా రైతులకు ర్యాలీ ద్వారా అవగాహనా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. భూమిలో పచ్చిరొట్టె ఎరువులను వినియోగించడం వలన భూమి సారవంతమై భూమిలో సూక్ష్మజీవులు పెంపొందుతాయని రైతులకు సూచించారు. పంట మార్పిడి విధానం పాటించడం వలన కలుపును నివారించుకోవచ్చని సూచించారు. వీహెచ్ఏ మేరి, వీటీఏ చంద్రిక, శ్రీనివాసరావు, మౌనిక, అంజలి, ప్రియాంక, కరిమూన్, శిరీష, రైతులు ర్యాలీలో పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలతో ఉపయోగం



వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి

చినగంజాం: వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శికాసు ఆదిలక్ష్మి సూచించారు. బుధవారం చినగంజాం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంప్యూటర్, చిత్రలేఖనం, వ్యాయామం, చదవడం, రాయడం, సృజనాత్మక కృత్యాలు వంటి పలు అంశాలపై అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథపాలకుడు అళహరి మోహన లక్ష్మీ నరసింహాచార్యులు, జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్. నరసింహారావు, రిసోర్ పర్సన్‌లు వై. రామాంజనేయులు, పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన



స్వామి వారి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అద్దంకి: అద్దంకిలోని భవాని సెంటర్‌లోని స్వామి, అమ్మవార్లు



దండుదారి వద్ద ఉన్న ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామి మూలవిరాట్

వేటపాలెం: పందిళ్లపల్లి పాతూరులో చీరాల- ఒంగోలు రోడ్డు పక్కగల పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మందిరంలో ఆరాధన మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఉదయాన్నే అఖండ దీపారాధన చేసి స్వామి వారికి విశేష అభిషేకాలు, పుష్పాల్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంకాలం మందిరం వద్ద భజనావళి జరిగింది. ఖాదర్ మాస్తాన్ స్వామి కోలాట సమాజం వారిచే కోలాల నాట్యం నిర్వహించారు. సాయంతం దీపోత్సవం అనంతరం గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి నగరోత్సవం నిర్వహించారు. కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆరాధన మహోత్సవానికి పోటెత్తిన భక్తులు

యద్దనపూడి: మండల పరిధిలోని గన్నవరం-మార్టూరు దండు దారి వద్ద వేంచేసి ఉన్న గోవింద మాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు, అభిషేకాలు, హోమాలు, భజన కార్యక్రమాలతో పాటు జెండా ఊరేగింపు మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని నిర్వాహకులు మంగళగిరి వీరాంజనేయులు పర్యవేక్షించారు. మండలంలోని పూనూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

పర్చూరు(చినగంజాం): గేరాడ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బోడవాడ గ్రామంలో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉచిత చలివేంద్రాన్ని బుధవారం సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి ఏ. మస్తాన్‌రావు, పర్చూరు మాజీ ఎంపీపీ కొల్లా వెంకట్రావు, రిటైర్డ్ నేవీ అధికారి వడ్రాణం బాబురావు, గేరాడ్స్ ఫౌండేషన్ ప్రధాన ట్రస్టీ గేరా స్వరాజ్ కుమార్, ట్రస్టీలు తానికొండ జయానంద్, అల్లాడి సంతోషం, కూరాకుల ఇస్సాక్‌బాబు, గాజుల రమేష్, కోటం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



మెరిట్ విద్యార్థిని సంధ్యారాణికి నగదు అందజేస్తున్న సేవా సభ్యులు

చినగంజాం: మండలంలోని సోపిరాల గ్రామంలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సోపిరాల ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (సేవా) సభ్యులు నగదు ప్రోత్సాహకం అందజేశారు. సోపిరాల గ్రామంలో టెన్త్‌లో ప్రథమ స్థానం సాధించిన నందమూడి సంధ్యారాణి, నున్నా రేవంత్, పోలకం జయవర్ధన్ కుమార్‌లను బుధవారం ఒక్కొక్కరికి రూ. 5116 నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. సేవా గ్రూపు తరఫున ప్రతి ఎడాది ఇదే విధంగా నగదు ప్రోత్సాహకం అందజేయనున్నట్లు వారు తెలిపారు. సిద్ధం నాగమల్లేశ్వరరావు, నరహరి చంద్రశేఖర్, పర్వతరెడ్డి సరళ, పల్లపోలు హిమవంతేశ్వరి, బత్తుల స్వాతి, పర్వతరెడ్డి సుధాకర్, తుమ్మలపెంట పద్మనాభయ్య, మెట్టు రవి,' మెట్టు శ్రీనివాసరావు, సాయని సాంబశివరావు, పోలకం వెంకయ్య, దేశంశెట్టి సురేష్ పాల్గొన్నారు.

చరిత్రలో అల్లూరి నిలిచిపోయారు



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చీరాల రూరల్: బ్రిటిష్ వారితో వీరోచితంగా పోరాడి వారి తుపాకీ గుళ్లకి ఎదురెళ్లి ప్రాణత్యాగం చేసిన ధీరుడు అల్లూరి సీతారామరాజు అని వక్తలు కొనియాడారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం సీనియర్ సిటిజన్స్, ఊరూరా జన విజ్ఞానం సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఊరూరా జనవిజ్ఞానం రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు చేసిన మన్యం వీరోచిత పోరాటాలు మరువలేనివన్నారు. అల్లూరి జీవిత చరిత్ర ఆధారంగా తెలుగులో తీసిన అల్లూరి సీతారామరాజు సినిమా ఎంతో అద్భుతమన్నారు. నేటి తరం యువత అల్లూరి స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు గాదె హరిహరరావు, సీతారామాంజనేయ శర్మ, ఎ. రామారావు, సుబ్బారావు, ఎస్కే సుభాని, శ్రీరామచంద్రమూర్తి, కె. రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇ- శ్రమ్ గుర్తింపు కార్డులు పొందండి

చీరాల రూరల్: చేతి వృత్తులు చేసేవారు, వివిధ సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు విధిగా కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ఇ- శ్రమ్ గుర్తింపు కార్డులు పొందాలని చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు సూచించారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో బుధవారం కొత్తపేటలోని బాలా హ్యాండ్లూమ్స్‌లో కార్మికుల హక్కులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అసంఘటిత రంగ కార్మికులు.. చట్టాలు కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్మికులు చేసే పనికి తగిన వేతనాలను యామజాన్యాలు అందించాలని సూచించారు. బార్ అసోసియేషన్ సెక్రటరీ ఎం. రవికుమార్, న్యాయవాది ఎ. రామకృష్ణారెడ్డి, హ్యాండ్లూమ్స్ యజమాని అంజనేయులు, కార్మికులు పాల్గొన్నారు.

లాక్రోస్‌లో ప్రైడ్ స్కూల్ విద్యార్థుల సత్తా

చీరాల రూరల్: జాతీయ స్థాయి లాక్రోస్ క్రీడా జట్టులో చీరాల ప్రైడ్ స్కూలు క్రీడాకారులు ఇద్దరు స్థానం దక్కించుకుని రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపచేశారు. గతనెల 29 నుంచి ఈనెల 1వ తేదీ వరకు ఆగ్రాలో జాతీయ స్థాయి లాక్రోస్ పోటీలు నిర్వహించారు. కాగా ప్రైడ్ స్కూలు విద్యార్థులు ప్రతిభ ఫలితంగా ఆంధ్ర ప్రదేశ్ జట్టు మూడో స్థానంలో నిలిచినట్లు స్కూలు ప్రిన్సిపాల్ బి. అశోక్ బాబు బుధవారం తెలిపారు. సబ్‌జూనియర్ బాల, బాలికలు, జూనియర్స్ విభాగంలో, సీనియర్స్ విభాగంలో సత్తా చాటారన్నారు. ఇటీవల కాలంలో లాక్రోస్ క్రీడ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ క్రీడలో రాణించిన క్రీడాకారులకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు.